

టెన్త్ పరీక్ష కేంద్రాల పరిశీలన

పార్వతీపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్వతీపురంతో పాటు పలు ప్రాంతాల్లో టెన్త్ పరీక్ష కేంద్రాలు, మూల్యాంకన సెంటర్లను శుక్రవారం పదో తరగతి పరీక్షల సంచాలకుడు డి.దేవానంద్‌రెడ్డి పరిశీలించారు. మౌలిక వసతులు, ఇతరత్రా సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎటువంటి లోటుపాట్లు ఉండ రాదన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లపై సిబ్బంది తగు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్, పరీక్షల సహాయ కమిషనర్ తదితరులు ఉన్నారు.

క్వింటాకు రూ.600

నష్టానికే..

- పత్తి రైతులకు తప్పని కష్టాలు
- సహకరించని ప్రకృతి.. తగ్గిన దిగుబడి
- అందుబాటులో లేని కొనుగోలు కేంద్రాలు
- అందని గిట్టుబాటు ధర
- సమీపిస్తున్న పండగ
- తప్పనిసరి పరిస్థితుల్లో దళారులు, ప్రైవేట్ వ్యాపారుల చెంతకు ..
- ఆర్థికంగా కుదేలవుతున్న వైనం

(భామిని)

వరికి ప్రత్యామ్నాయంగా పత్తి సాగు చేపట్టిన రైతులకు ఈ ఏడాది కష్టాలు తప్పడం లేదు. గిట్టుబాటు ధర లేకపోవడంతో పంటను విక్రయించుకోలేక.. నిల్వ ఉంచలేక తీవ్రంగా సత మతమవుతున్నారు. మరోవైపు సంక్రాంతి సమీపిస్తోంది. చేతిలో చిల్లిగవ్వ లేదు. పండగ గట్టెక్కాలంటే.. ఎలాగోలా పంటను విక్రయించాల్సిన పరిస్థితి. కొనుగోలు కేంద్రాలు కూడా అందుబాటులో లేకపోవడంతో విధిలేక ప్రైవేట్ వ్యాపారులు, దళారులను ఆశ్రయిస్తున్నారు. మొత్తంగా క్వింటాకు రూ.600 నష్టానికి పంటను విక్రయించాల్సి రావడంతో మండల రైతులు లబోదిబోమంటున్నారు.



తప్పనిసరి పరిస్థితుల్లో ఇంటిలోనే పత్తిని నిల్వ చేసుకున్న రైతు (ఫైల్)

ఇదీ పరిస్థితి..

భామిని మండలంలో ఏటాలానే ఈ సారి కూడా 8వేల ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. ఎకరాకు రూ.30 నుంచి 35 వేల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే ఈ ఏడాది రైతులకు ప్రకృతి సహకరించలేదు. సరిగ్గా పువ్వు, కాయ దశలో వర్షాభావ పరిస్థితి నెలకొంది. దీంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. ఆ ప్రభావం దిగుబడిపై పడింది. ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. ప్రస్తుతం గిట్టుబాటు ధర కూడా లేదు. ప్రభుత్వం క్వింటా పత్తి ధరను రూ.7,025 నిర్ణయించగా, ఈ ప్రాంతంలో దళారులు క్వింటా రూ.6,400 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. దీంతో సుమారు రూ.625 చొప్పున రైతులు క్వింటా వద్ద నష్టపోతున్నారు. అయితే గతేడాది క్వింటా పత్తి ధరను ప్రభుత్వం రూ. 7వేలుగా నిర్ణ యించగా, డిమాండ్ దృష్ట్యా బయట మార్కెట్లో రైతులు క్వింటా పత్తిని రూ.7,600కు విక్రయించారు. అయితే ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. సంక్రాంతి సమీపిస్తుండడం, దళారుల ఒత్తిడి కారణంగా నష్టానికే పంటను విక్రయించాల్సి వస్తోంది. వాస్తవంగా నెలరోజుల కిందటే కొంతమంది వ్యాపారులు నాసిరకం పత్తి అంటూ రైతులను భయపెట్టి కొనుగోలు చేశారు. అయితే ఇంకొంతమంది రైతులు మాత్రం తమ ఇళ్లలో పంటను నిల్వ ఉంచి ఇప్పుడిప్పుడు అమ్మకాలు చేపడుతున్నారు. అయినా వారికి నష్టాలు తప్పడం లేదు. రోజు రోజుకూ మార్కెట్లో ధర తగ్గుతుండడంతో వారు తలలు పట్టుకుంటున్నారు. ఇదే అను వుగా మహారాష్ట్ర, గుంటూ రుకు చెందిన బయ్యర్లు సిండి కేట్లుగా మారి స్థానిక దళారులతో చేతులు కలుపుతున్నారు. సంక్రాంతి ముందే రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తున్నారు.





విక్రయానికి పత్తిని తూకం వేస్తున్న దృశ్యం

కొనుగోలు కేంద్రం లేక..

మండలంలో భారీ ఎత్తున పత్తి పంట సాగవుతున్నా.. ఈ ప్రాంతంలో అధికారులు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం లేదు. దీంతో ఏటా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాజాంలో కేంద్రం ఏర్పాటు చేస్తున్నప్పటికీ .. అక్కడకు పంటను తీసుకెళ్లేందుకు రవాణా చార్జీలు రైతులకు భారమవుతున్నాయి. తీరా పత్తిని అక్కడకు తీసుకెళ్తే.. నాణ్యత పేరిట కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొర్రీలు పెడుతుండడం పరిపాటిగా మారింది. ఈకేవైసీ, పంట నమోదు లేకుంటే పత్తిని కొనుగోలు చేయడం లేదు. దీంతో ఈసురోమంటూ తిరిగి పత్తిని స్వగ్రామాలకు తీసుకు రావడం రైతులకు తలకుమించిన భారంగా మారుతోంది. దీంతో ఏటా వారు స్థానిక దళారులు, ప్రైవేట్ వ్యాపారులకే పత్తిని విక్రయించాల్సి వస్తోంది. కాగా కొనుగోలు కేంద్రానికి వెళ్లిన పత్తి వివిధ కారణాలతో నిర్వాహకులు తీసుకో కుంటే.. బయట మార్కెట్లోనూ వాటిని ఎవరూ క్రయం చేయడం లేదు. రైతులకు ఈ తలనొప్పి కూడా ఉండడంతో అత్యధికులు కొనుగోలు కేంద్రం వైపు చూడడం లేదు. ఈ నేపథ్యంలో స్థానికంగానే కేంద్రం ఏర్పాటు చేస్తే ఈ ఇబ్బందులు ఉండవని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. దీనిపై వ్యవసాయాధికారి మన్మథరావును వివరణ కోరగా.. ఈకేవైసీలో నమోదు చేసి ఉంటే రాజాంలోని కేంద్రంలో క్వింటా రూ.7,025 చొప్పున పత్తిని కొనుగోలు చేస్తామన్నారు. నలుగురైదుగురు రైతలు కలిసి విక్రయిస్తే సహకరిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

మస్తర్ల నిర్వహణ ఇలాగేనా?

- సిబ్బందిపై డ్వామా పీడీ మండిపాటు
- రికవరీ చేస్తామని వెల్లడి

భామిని: ఉపాధి హామీ పథకం మస్తర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో డ్వామా పీడీ రామచంద్ర రావు అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది తీరుపై మండిపడ్డారు. ఇలాగే నిర్వహిస్తారా? అంటూ ప్రశ్నించారు. శుక్రవారం భామిని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఉపాధి మస్తర్లలో వేతనదా రుల వేలిముద్రలు లేవని తనిఖీ బృందం తెలిపింది. దీనిపై డ్వామా పీడీ స్పందిస్తూ.. మస్తర్ల నిర్వహణలో నిర్లక్ష్యం తగదన్నారు. వేతనదారుల వేలిముద్రలు, సంతకాలు లేకపోతే రికవరీ తప్పదని స్పష్టం చేశారు. అనంతరం హార్టికల్చర్‌లో భాగంగా నాటిన మొక్కల్లో ప్రస్తుతం 30 శాతం కూడా కనిపించడం లేదని తనిఖీ బృంద సభ్యులు తెలిపారు. దీనికి బాధ్యులైన వారి నుంచి రికవరీ చేస్తామని డ్వామా పీడీ తెలిపారు. విధి నిర్వహణలో వేతనదారులకు పనులు సమకూర్చకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉండగా మండలంలో 2023 డిసెంబరు నుంచి 2024 జనవరి 11 వరకు జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ చేసినట్టు ఎస్ఆర్‌పీ తిరుపతిరావు తెలిపారు. ఆయా పనులకు రూ.12 కోట్లు వెచ్చించినట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీహరి, ఎంపీడీవో ఉమామహేశ్వరి, ఏపీవో తులసీదాస్ తదితరులు ఉన్నారు.



సిబ్బందిని ప్రశ్నిస్తున్న పీడీ

23 వరకు ఇంటింటా సర్వే: డీపీవో

గరుగుబిల్లి, జనవరి 12 : జిల్లాలో మారుమూల గ్రామాల అభివృద్ధితో పాటు మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రణాళికలను రూపొందించేందుకు ప్రత్యేక సర్వేను నిర్వహిస్తున్నామని డీపీవో బలివాడ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం వల్లరిగుడబలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా పలు పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే తగు పరిష్కారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, కార్యదర్శి డి.దిలీప్ కుమార్, పి.శిరీష, తదితరులు పాల్గొన్నారు.



నైవేద్యం సమర్పయామి..

ధనుర్మాసోత్సవాల సందర్భంగా సాలూరులోని పెదకోమటిపేట రామాలయంలో గోదా రంగనాథ స్వామికి కుడారై వెల్లుం (విశేష ప్రసాద సేవ)ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుత్వికులు శాస్త్రోక్తంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, వివిధ కైంకర్యాలను చేశారు. అనంతరం 108 కలశాలతో ప్రసాద నివేదన చేశారు. 27వ పాశుర తిరుప్పావైను పఠించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. పట్టణంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలోనూ ప్రసాద సేవ నిర్వహించారు.

\- సాలూరు రూరల్

సీతంపేట మన్యంలో ఫైలేరియా పరీక్షలు

సీతంపేట: సీతంపేట మన్యం పరిధిలో గిరిజనులకు వైద్యసిబ్బంది ఫైలేరియా పరీక్షలు చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి రక్త నమూనాలు సేకరిస్తున్నారు. అదే విధంగా కొందరికి సికిల్ సిలేమియా పరీక్షలు కూడా చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం దోనుబాయి పీహెచ్‌సీ పరిధిలో గిరిజనులకు ఫైలేరియా టెస్టులు చేశారు. సుమారు 6,500 మందికి రక్త పరీక్షలు చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు 3,800 మంది నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు వైద్యాధికారి భానుప్రతాప్ తెలిపారు. ఏజెన్సీలో ఫైలేరియా వ్యాధి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని, గిరిజనులకు దానిపై అవగాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. ఆయన వెంట మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడొద్దు

- ఏనుగుల సంచార ప్రాంతాల్లో అటవీశాఖ ప్రచారం

సీతంపేట: ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడరాదని అటవీశాఖ అధికారులు సూచించారు. ఈ మేరకు శుక్రవారం పలు గ్రామాల్లో ఆటో ద్వారా ప్రచా రం చేశారు. శీతాకాలంలో ఏనుగుల ప్రవర్తనలో మార్పు వస్తుందని, వాటి వద్దకు ఎవరూ వెళ్లరాదని, సెల్ఫీల కోసం ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని చెప్పారు. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో ఒంటరిగా బయట తిరగరాదని, ఆ సమయాల్లో పొలాలకు కూడా వెళ్లరాదని సూచించారు. పండగలకు గ్రామాల్లోకి వచ్చిన వారు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ నెల 17 వరకు ఏనుగులు సంచరిస్తున్న గ్రామాల్లో విస్తృతంగా ప్రచారంగా చేపడతామని, గజరాజులను పర్యవేక్షిస్తామని అటవీశాఖ పాలకొండ రేంజర్ తవిటినాయుడు స్పష్టం చేశారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు.



ఘనసర గ్రామంలో ప్రచారం చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

సర్కారు తీరుకు నిరసనగా.. కోటి సంతకాల సేకరణ

- జిల్లాలో వినూత్నంగా అంగన్‌వాడీల ఆందోళన
- ఎస్మా, నోటీసులకు భయపడేది లేదని వెల్లడి
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

బెలగాం/సాలూరు/సీతంపేట/పాలకొండ/కురుపాం, జనవరి 12: వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని.. తదితర డిమాండ్లతో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 32వ రోజుకు చేరుకుంది. వైసీపీ సర్కారు ఒక వైపు ఎస్మా ప్రయోగించినా, షోకాజ్ నోటీసులు ఇస్తున్నా వారు వెనక్కి తగ్గడం లేదు. యథావిధిగా పోరును కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ తీరును ఖండిస్తూ శుక్రవారం జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. గతంలో తమకు సీఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రం పార్వతీపురంలోని కలెక్టరేట్ శిబిరం వద్ద నిరసన దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నోటీసులకు తాము భయపడేది లేదని.. తక్షణమే ఎస్మాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చిరుద్యోగులపై మొండి వైఖరి తగదన్నారు. గతకొద్దిరోజులుగా రోడ్డెక్కి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా.. సర్కారు స్పందించకపోవడం దారుణమన్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని, లేకుంటే సమ్మె మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. అనంతరం సర్కారు తీరుకు నిరసనగా వారు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. యూటీఎఫ్ నాయకుడు ఎస్.మురళీమోహన్, సీనియర్ న్యాయవాది టి.జోగారావు, పట్టణ ప్రముఖులు సంతకాలు పెట్టి అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. సాలూరులో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బోసుబొమ్మ కూడలి వరకు అంగన్‌వాడీలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మానవహారం చేశారు. అనంతరం సర్వమత ప్రార్థనలు చేశారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని యూటీఎఫ్ జిల్లా నాయకులు కోట జానకిరామ్, మండల ప్రధాన కార్యదర్శి గణేష్ ప్రారంభించారు. ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైసీపీ.. ఇలా చిరుద్యోగులను మోసం చేయడం సరికాదని అన్నారు. సీతంపేటలోని ఐటీడీఏ శిబిరం వద్ద అంగన్‌వాడీలు గరిటెలతో కంచాలు మోగిస్తూ నిరసన తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారుల వద్దకు వెళ్లి తమకు సంఘీభావం తెలపాలని సంతకాల సేకరణ చేపట్టారు. పాలకొండలో శిబిరం వద్ద అంగన్‌వాడీలు మొట్టికాయలు వేసుకుని నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమ ప్రభ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కాగా మొదటి సంతకం డీటీ పెట్టారు. కురుపాంలోనూ అంగన్‌వాడీలు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.



కురుపాంలో సంతకాలు సేకరిస్తున్న అంగన్‌వాడీలు



పార్వతీపురంలో శిబిరం వద్ద సంతకం పెడుతున్న యూటీఎఫ్ నేత



పాలకొండలో మొట్టికాయలు వేసుకుంటూ...

218 మందికి షోకాజ్ నోటీసులు..

సీతంపేట: మండలంలో 218 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు షోకాజ్ నోటీసులు పంపారు. అయితే వారెవరూ వాటిని తీసుకోకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు నోటీసులు అంటించారు. కొంతమందికి రిజిస్టర్ పోస్టులో పంపించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది ద్వారా అంగన్‌వాడీలకు నోటీసులు అందిస్తున్నామని ఐసీడీఎస్ పీవో రంగలక్ష్మి తెలిపారు. అయితే అంగన్‌వాడీలు మండిపడుతున్నారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు సమ్మె విరమించేది లేదని తేల్చి చెప్పారు.



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో కంచాలు మోగిస్తూ నిరసన తెలుపుతున్న దృశ్యం



సాలూరులో సర్వమత ప్రార్థనలు చేస్తున్న అంగన్‌వాడీలు

మళ్లీ పోదాం.. మట్టింటికే!

- మట్టితో నిర్మించిన ఇళ్లే ఆరోగ్యం
- సంప్రదాయ నిర్మాణాలు కొనసాగేలా కొత్త టెక్నాలజీ
- రసాయన ఇబ్బందులు లేవు.. ఖర్చూ తక్కువే
- అవగాహన కల్పిస్తున్న యువకులు



మట్టితో తయారు చేసిన ఇంటి నమునా

మెరకముడిదాం


మన పూర్వీకులంతా దాదాపుగా మట్టి ఇళ్లల్లోనే ఉండేవారు. ఈ విషయం గ్రామాల్లో ఉండే కొంతమందికి తెలిసే ఉంటుంది. మట్టి గోడలు, కమ్మలతో ఏర్పాటుచేసిన పైకప్పు, మట్టి గచ్చు (నేల)తో ఇంటి నిర్మాణం జరిగేది. ఈ మట్టి ఇంటి నిర్మాణం చాలా త్వరగా, తక్కువ ఖర్చుతో పూర్తయ్యేది. కానీ కాలక్రమంలో, టెక్నాలజీ పెరుగుతున్న ఈ రోజుల్లో దాదాపుగా ఈ మట్టి ఇళ్లు కనుమరుగయ్యాయి. కానీ మళ్లీ మట్టి ఇళ్ల ప్రాధాన్యం వివరిస్తూ, వాటి నిర్మాణాలపై శిక్షణ ఇస్తున్నారు జిల్లాకు చెందిన కొంతమంది యువకులు. మట్టి ఇళ్లు ఆరోగ్యకరమంటూ, వాటినే నిర్మించు కోవాలని సూచిస్తున్నారు.

రసాయనాలతో కూడిన ముడిసరుకుల జోలికి పోకుండా ఆరోగ్య వంతమైన ఇళ్ల నిర్మాణాలపై ఓ యువకుడు దృష్టి పెట్టారు. సహజ సిద్ధంగా లభ్యమయ్యే మట్టితో పూర్వకాలంలో ఇళ్ల నిర్మాణ టెక్నాలజీ అంత రించిపోకుండా యువతకు శిక్షణ అందిస్తున్నారు. స్థానికంగా లభ్యమయ్యే వనరులతోనే ఆరోగ్యవంత మైన ఇంటిని నిర్మించు కునే విధంగా శిక్షణ కార్యక్రమాలు జరుగు తున్నాయి. ఎటువంటి ఖర్చు లేకుండా విరివిగా లభ్యమయ్యే మట్టి ఇళ్ల నిర్మాణాలను ప్రోత్స హించేందుకు జిల్లాలోని మెరకముడిదాం మండలం బొడందొర వలస గ్రామంలో అర్కిటెక్చర్ ఆదిత్య శర్మ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈయన కిషోర్ అనే మరొకరితో కలిసి ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆరోగ్యానికి ఈ మట్టి ఇళ్లు ఎంత గానో మేలు చేస్తుందని వెల్లడిస్తున్నారు.



మట్టితో నిర్మించిన ఇంటిలోపల భాగం

శిక్షణ ఇస్తున్నాం...



మట్టి ఇళ్ల నిర్మాణాలపై ఇప్పటి వరకూ 1,600 మందికి శిక్షణ ఇచ్చామని ఆదిత్య శర్మ చెపుతున్నారు. ఇతర దేశాల వారు కూడా ఆసక్తిగా శిక్షణ పొందుతున్నారని వివరించారు. విజయనగరం జిల్లాలో కూడా విస్తృతంగా యువతీ, యువకులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. మంచి ఆరోగ్యం కోసం మట్టి ఇళ్ల నిర్మాణాల ఆవశ్యకత ఎంతో ఉందన్నారు.



నిర్మాణం ఇలా..

- ఖాళీ సిమెంటు బ్యాగులను శుభ్రపరిచి వాటిలో మట్టి నింపి వరుసగా పేర్చుతారు. ఖాళీల వద్ద మట్టిని అద్ది గోడలను సిద్ధం చేస్తారు. ద్వారబందాలు, కిటికీలు సహజ సిద్ధంగా లభ్యమయ్యే కలపతోనే తయారు చేస్తారు. ఇంటి పైకప్పును కూడా సహజసిద్ధంగా లభ్యమయ్యే దృఢమైన కలప దుంగలను పేర్చి మట్టిని అద్ది పైకప్పును తయారు చేస్తారు. వర్షం పడినపుడు పైకప్పు మట్టి కరిగిపోకుండా గడ్డి మేట్లు వేసి కోతకు గురికాకుండా ఏర్పాట్లు చేస్తారు. ఇలా సహజ సిద్ధ ముడి సరకులతో నిర్మాణాలు చేపడుతున్నారు.
- రసాయనాలతో తయారు చేసే సిమ్మెంటు, ఐరన్ వంటి ముడిసరుకులను వాడటం ద్వారా కాలుష్యం ఏర్పడుతుంది. మనిషి ఆహారంలో ఆర్గానిక్ ఫుడ్ ఎంత అవసరమో మట్టితో నిర్మించే ఇళ్లు కూడా అంతూ ఆరోగ్యం. ఈ టెక్నాలజీ ద్వారా అతి తక్కువ ఖర్చుతో నివాస గృహాలను నిర్మించుకోవటం సాధ్యమవుతుంది. ఖర్చు కూడా స్వల్పంగా ఉండడంతో, ఇంటి లోపల కలపతో తయారు చేసిన ఇంటీరియల్ ఏర్పాటు చేసుకోవచ్చు. సుమారు లక్ష రూపాయలు ఖర్చు చేస్తే చక్కనైన ఆరోగ్య వంతమైన ఇళ్లు ఇక్కడ సాధ్యమే. ఏది ఏమైనా పురాతన టెక్నాలజీ కాల గర్భంలో కలిసి పోకుండా తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన ప్రకృతి సిద్ధ ఇంటి నిర్మాణం అందరిలోనూ ఆసక్తిని రేపుతోంది.

అంబేడ్కర్ అందరివాడు

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, జనవరి 12: కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల వారి అభ్యున్నతి కోసం పాటు పడిన అంబేడ్కర్ అందరివాడని కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. సామాజిక సంకల్ప మహోత్సవంలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, పర్యాటక శాఖ అధికారి లక్ష్మీనారాయణ, జీఎస్ డబ్ల్యూవో నిర్మలాదేవి, దళిత సంఘ నాయకులు జయరాజ్, భానుమూర్తి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదులు ప్రారంభం



అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైం, జనవరి 12: జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో కమ్యూనికేషన్ విభాగానికి నిర్మించిన నూతన గదులను ఎస్పీ దీపిక శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమ్యూనికేషన్ విభాగంలో పనిచేసే మహిళా సిబ్బంది వేచి ఉండేందుకు, కమ్యూనికేషన్ పరికరాలు ఉంచేందుకు రెండు గదులను శ్రమ దానంతో నిర్మించామన్నారు. శ్రమదానం చేసిన పోలీసు సిబ్బంది, హోంగార్డులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అస్మాపరహీన్, ట్రైనీ ఐపీఎస్ మండా జావలి ఆల్ఫాన్, డీఎస్పీలు విశ్వనాథ్, ఆర్.గోవిందరావు, ఆర్.శ్రీనివాసరావు, యూనివర్స్ సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

24 గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు



పనులు పరిశీలిస్తున్న డీఈ పైడిరాజు తదితరులు

వేపాడ, జనవరి 12: మండలంలోని 24 గ్రామాల్లో రూ.535 లక్షలు జలజీవన్ నిధులతో తాగునీటి సరఫరా పనులు చేపడుతున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆర్.వి. పైడిరాజు తెలిపారు. శుక్రవారం బంగారయ్యపేట, కోటయ్యగరువు, చిట్టివానిపాలెం గ్రామాల్లో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలో ఎస్సీ ఎస్టీ పథకం కింద నిధులు మంజూరు కాని గ్రామాల్లో కూడా జలజీవన్ నిధులతో మంచినీటి ట్యాంకులు, ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. పోతుబందిపాలెం, వెంకయ్యపాలెం, కోటయ్యగరువు, చిట్టువానిపాలెం, శొంటివానిపాలెం, సంఘంవలస, బంగారయ్యపేట, నర్పిపల్లి తదితర గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉగాది నాటికి పనులు పూర్తి చేసి తాగునీరు ప్రజలకు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్టు డీఈ తెలిపారు.

ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకుడు రాజు

బొబ్బిలి, జనవరి 12: కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ (ఓపీఎస్) విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ (257) జిల్లా నాయకుడు జేసీ రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో బంకురు జోగినాయుడు అధ్యక్షతన శుక్రవారం డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులందరికీ దేశవ్యాప్తంగా ఓపీఎస్‌ను అమలు చేస్తున్నారని... మన రా ష్టంలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2018 నుంచి బకాయి పడిన 12 విడతల కరవుభత్యం బకాయిలు, పీఎఫ్, వంటి మొత్తం రూ.32 వేల కోట్లను ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్‌దారులందరికీ తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న 22 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఏపీ గురుకుల పాఠశాలల్లో గెస్ట్ టీచర్లుగా పనిచేస్తున్న వారికి 12 సంవత్సరాలుగా రూ.14 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, వారికి మినిమమ్ టైమ్ స్కేలును వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు ఎల్లయ్య, శ్రీను, రమేష్, పరిశినాయుడు, మోహనరావు, డి.రాములు, చంద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెస్టివల్‌కు కంచరాం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

రాజాం రూరల్, జనవరి 12: ఈ నెల 17 నుంచి 20 వరకూ ఫరీదాబాద్ (హర్యానా)లో ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అయిదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎన్.సి.ఇ.ఆర్.టి. (న్యూఢిల్లీ), కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ, అంతరిక్ష పరిశోధన శాఖ, విజ్ఞాన్ భారతి సంయుక్తంగా నిర్వహిస్తున్న స్టూడెంట్ సైన్స్ విలేజ్‌లో దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రం నుంచి 20 మంది వంతున విద్యార్థులు హాజరుకానున్నారు. ఇక్కడి భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పండూరు వేణుగోపాల్ సారథ్యంలో తొమ్మిదో తరగతి విద్యార్థులు పి.సౌజన్య, పి.శిరీష, పి.చరణ్, పి.సత్యవతి, బి.దినేష్ హాజరవుతున్నారు. వీరు కాంతికి సంబంధించిన ప్రాజెక్ట్‌ను ప్రదర్శిస్తారు. ఈ విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వర రెడ్డి, ఉప విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, హెచ్.ఎం. వసంత కుమార్, సిబ్బంది అభినందించారు.

గ్రంథాలయం ప్రారంభం

రాజాం: గ్రంథాలయాలే దేశ భవితకు బంగారు బాట అని కేంద్ర సాహిత్య అకాడమీ యువజన పురస్కార గ్రహీత ప్రగతి బాలసుధాకర్ అన్నారు. శుక్రవారం కంచరాం గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రజా గ్రంథాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ ఇటువంటి గ్రంథాలయాలు ఉండాలని, గ్రంథాలయాలే విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తాయన్నారు.

నగరమంతా పండగ సందడే

- బస్, రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ

విజయనగరం(ఆంధ్రజ్యోతి), జనవరి 12: సంక్రాంతి పండగకు సొంతూళ్లు వచ్చినవారితో పల్లె పులకరిస్తోంది. బతుకు తెరువు, జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు వెళ్లిన వారు పెద్దపండగ సందర్భంగా కుటుంబాలతో సహా ఇళ్లకు చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లాలోని బస్‌స్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు ప్రయాణికులతో కిక్కిరిసి పోయి, రద్దీ వాతావరణం నెలకొంది.

జిల్లాకు కొత్తగా 4270 రైస్ కార్డులు

కలెక్టరేట్: జిల్లాకు కొత్తగా 4270 రైస్ కార్డులు మంజూరైనట్లు జేసీ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది జూలై 31 నుంచి వచ్చిన దరఖాస్తులకు ఈ కార్డులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఎండీయూల వద్ద బియ్యం, పంచదార, కందిపప్పు ఈనెల నుంచి తీసుకోవాలని పేర్కొన్నారు.

ధాన్యం డబ్బులు విడుదల

కలెక్టరేట్: జిల్లాలోని ఇప్పటి వరకూ సేకరించిన ధాన్యంకు రూ 351 కోట్లు నిధులు విడుదలైనట్లు జేసీ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. 494 రైతు భరోసా కేంద్రాలు 65,206 మంది రైతులు నుంచి 2.63 లక్షలు మెట్రిక్ టన్నులు సేకరించామని తెలిపారు.ఇప్పటి వరకూ రూ.113 కోట్లను రైతుల ఖాతాకు జమ చేయగా, శుక్రవారం రూ.351 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. 2023-24 సీజను ఇప్పటి వరకూ రూ.464 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేశామన్నారు.

ధాన్యం సేకరణకు తాత్కాలిక విరామం

కలెక్టరేట్: జిల్లాలోని ధాన్యం సేకరణకు తాత్కాలికంగా విరామం పడనుంది. మిల్లులు వద్ద పని చేస్తున్న హమాలీలు సంక్రాంతి పండగ పనుల్లో నిమగ్నం కానున్న నేపథ్యంలో ఐదు రోజుల పాటు ధాన్యం సేకరణ ప్రక్రియ తాత్కాలికంగా నిలిపివేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులు ట్రక్ షీట్లు జనరేట్ చేసినా, మిల్లుల వద్దకు వెళ్లినా ధాన్యం దించడానికి హమాలీలు ఉండరు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ధాన్యం సేకరణ ఐదు రోజుల పాటు నిలుస్తుంది. గత నెలలో జిల్లాలోని ధాన్యం సేకరణ మొదలు పెట్టారు. ఇప్పటి వరకూ 65 వేలు మంది రైతుల నుంచి 2.63 లక్షలు మెట్రిక్‌టన్నులు సేకరించారు. శుక్రవారం రైతు భరోసా కేంద్రాల్లో జనరేట్ చేసిన ట్రక్ షీట్లు జనరేట్ చేసిన ధాన్యాన్ని శనివారం మిల్లుల వద్ద దించుకుంటారు. అయితే ఈనెల 13 నుంచి నాలుగు రోజుల పాటు మిల్లుల వద్ద హమాలీలు ఉండరు. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు నాలుగు రోజుల పాటు ధాన్యం సేకరణకు బ్రేక్ వేస్తున్నారు.

కొత్తపేటలో నేడు దీపారాధన

విజయనగరం రూరల్: నగరంలోని కొత్తపేటలో ధనుర్మాసం సందర్భంగా గత నెల రోజులుగా మేలుకొలుపులు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం ముగింపు సందర్భంగా వెయ్యి మందితో దీపారాధన.. ఊరేగింపు నిర్వహించనున్నారు.

నిత్యావసరాలు, దుప్పట్ల పంపిణీ

విజయనగరం రూరల్: మారుతీ స్వయం సేవా సంఘ ఆధ్వర్యంలో నిరుపేదలకు శుక్రవారం నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కణపాకలోని ఆగురు వీధిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వ్యాపారవేత్తలు పెంటపాటి మార్కండేయులు, రాము తదితరులు పాల్గొన్నారు. 75 మందికి బియ్యం, ఇతర నిత్యావసరాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. సంఘ ప్రతినిధులు గుత్తూరు చంద్రశేఖర్, అరసాడ అప్పలస్వామి, తులసీరామ్, కోండ్రు కృష్ణారావు పాల్గొన్నారు.

అలరించిన రంగవల్లుల పోటీలు

విజయనగరం రింగురోడ్డు : ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో శుక్రవారం నిర్వహించిన రంగవల్లుల పోటీలు ఎంతో అలరించాయి. సుమారు 100 మంది మహిళలు వేసిన ముగ్గులు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించాయి. కె.అరుణ, జ్ఞాన ప్రసూన, కవితలు విజేతలుగా నిలిచారు. విజేతలకు ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యులు నారాయణం పద్మశ్రీ బహుమతులు అందజేశారు.

గిరిశిఖర గ్రామంలో ఇంటింటి కొళాయిలు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని బొడ్డవర పంచాయతీ గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడులో ఇంటింటి కొళాయిలను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శుక్రవారం ప్రారంభించారు. త్వరలోనే ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కలెక్టర్, సంబంధిత శాఖలతో మాట్లాడినట్లు తెలిపారు. కార్యక్రమంలో మురళీరాజు, సన్యాసిదేముడు, పంచాయతీ కార్యదర్శి బంగారు నాయుడు, గ్రామపెద్దలు, గిరిజన సంఘ నాయకులు ఉన్నారు.

టీడీపీతోనే భవిష్యత్తు

శృంగవరపుకోట, జనవరి 12: ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును ఎన్నుకున్నప్పుడే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం స్థానిక అన్న క్యాంటీన్ వద్ద ఎన్టీఆర్ సేవా సమితి, మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు సంయుక్తంగా సమకూర్చిన కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. టీడీపీ నేతలకు మాత్రమే సేవా గుణం ఉందన్నారు. గీతం యూనివర్సిటీ అధినేత ఎం.శ్రీభరత్ పేదలకు ఉచిత వైద్యం అందించడంతో పాటు ఉచితంగా కంటి అద్దాలను సమకూర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఒక్క చాన్స్ నినాదంతో గద్దెనెక్కిన సీఎం జగన్ రాష్ట్రాన్ని 25 ఏళ్ల వెనక్కి నెట్టారని ఆరోపించారు. విజన్ ఉన్న చంద్రబాబు నాయుడు మాత్రమే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలరన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైఎస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, నాయకులు కొండం మల్లేశ్వరరావు, కాపుగంటి శ్రీనివాసరావు, చక్క కిరణ్ కుమార్, అనకాపల్లి చెల్లయ్య, వాకాడ బాలు, భీశెట్టి అరుణ, భోసంగి జ్యోతి, మోపాడ చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లలితకుమారి

మునకలవలసలో వైసీపీకి భారీ షాక్

- 150 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కోండ్రు

రేగిడి: మునకలవలసలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. మాజీ సర్పంచ్‌లు శాసపు జనానరావు, గార శ్రీనివాసరావు, శాసపు గంగరాజుతో పాటు 150 కుటుంబాలు శుక్రవారం మాజీ మంత్రి కోండ్రు మురళీ మోహనరావు ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కోండ్రు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు దూబ ధర్మారావు, గేదెల బాల మురళీధర్, వి.నాగభూషణరావు, గురవాన ధనంజయ్‌రావు, చల్ల భుజంగ రావు, మాజీ జడ్పీటీసీ మంతిన ఉషారాణి పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



ర్యాలీగా అక్షింతలు పంపిణీ

జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు బోడసింగి అప్పలరాజు, మజ్జి హరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీగా ప్రతి ఇంటికీ అందించారు.

వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు



వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణ

బొబ్బిలి, జనవరి 12: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బొబ్బిలి పట్టణంలో గల పలు వైష్ణవా లయాల్లో కూడారై వెల్లుం(ప్రత్యేక ప్రసాద నివేదన) కార్యక్రమాన్ని ఘ నంగా నిర్వహించారు. వేకువజామున ధనుర్మాస పూజలు, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు ముగిసిన అనంత రం స్వామివారికి ప్రసాద నివేదన చేశారు. స్థానిక శ్రీ రుక్మిణీ సత్య భామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం తోటలో నీరాటోత్సవం (ఆండాళ్ అమ్మవారికి స్నానం) కుడా రై ప్రసాద నివేదన కార్యక్రమాన్ని ఆల య అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేశారు. కంచరవీధి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, సింగారపువీధి శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో కూడారై వెల్లుం కార్యక్రమాన్ని అర్చకులు, ధర్మకర్తలు తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

సంస్కృతీసంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



వేడుకల్లో ఏఎస్పీ

దాసన్నపేట, జనవరి 12: సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవలసిన ఆవశ్యకత ఉందని జిల్లా అదనపు ఎస్పీ అస్మాపరహీన్ అన్నారు. శుక్రవారం మైత్రీ మీడియా, ఎస్సార్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో సంయుక్తంగా గురజాడ కళా భారతి గ్రౌండ్‌లో రంగోలి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా ఏఎస్పీ హాజరై మాట్లాడుతూ భావితరాలకు చాటి చెప్పేందుకు, మగువల్లో కళా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు మైత్రీ మీడియా సంక్రాంతి సంబరాలు నిర్వ హిస్తోందని, ముగ్గులు వేసే అలవాటును మరుగున పడిపోకుండా మన సంస్కృతిని కాపాడటం అభినందనీయమన్నారు. గెలుపొందిన విజేతలను ప్రోత్స హించేందుకు బంగారు అభరణాలతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మైత్రీ మీడియా డైరెక్టర్ అవనాపు విక్రమ్, ఎస్ఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యం, మైత్రీ మీడియా యాజమాన్యం సిబ్బంది పాలొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జనసేన ఇన్‌చార్జి, నాయకులు

బొబ్బిలి, జనవరి 12: సంక్రాంతి సందర్భంగా పారాది గ్రామంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పల స్వామి, వీర మహిళ నాయకురాలు బంటుపల్లి దివ్య ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతిని ఉత్తరావల్లి శ్రావణి సాధించగా, బెల్లాన శశిరేఖ, ఆవాల గాయత్రిలు వరుసగా రెండు, మూడు బహుమతులను గెలుచుకున్నారు. వారికి ఉత్తరాంధ్ర మహిళా రీజినల్ కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీరాజ్ బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మహంతి ధనంజయ్, బెల్లాన శ్రీను, పేకేటి సురేష్, పున్నాన శేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు గంటా రాజు మృతి



విజయనగరం రూరల్: టీడీపీ నాయకుడు, జమ్ము మాజీ సర్పంచ్ గంటా రాజు అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున జమ్ములోని ఆయన నివాసంలో మృతి చెందారు. రాజు మృతికి టీడీపీ విజయనగర నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, టీడీపీ జిల్లా నాయకులు ఐవీపీ రాజు, విజ్జపు ప్రసాద్, బొద్దల నర్సింగరావు, నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు తదితరులు సంతాపం తెలిపారు.

బాధిత కుటుంబానికి నగదు అందజేత

దత్తిరాజేరు: టి.బూర్జివలసకు చెందిన బానాపురపు నగేష్ విశాఖలోని జంతు ప్రదర్శన శాలలో పనిచేస్తూ ఇటీవల ఎలుగుబంటి దాడిలో మృతిచెందిన విషయం విధితమే. ఈ మేరకు ఆయన తల్లిదండ్రులకు విశాఖ జూ అధికారులు శుక్రవారం టి.బూర్జివలసలో రూ.10లక్షల చెక్కును అందజేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో బొబ్బిలికి గుర్తింపు

బొబ్బిలి, జనవరి 12: స్వచ్ఛ సర్వేక్షణ్ 20023-24 సంవత్సరానికి రాష్ట్ర స్థాయిలో బొబ్బిలి మున్సిపాలిటీకి ద్వితీయ స్థానం లభించింది. లక్ష లోపు జనాభా కలిగిన పురపాలక సంఘాలతో పోటీ పడి దక్షిణ భారతదేశంలో 8వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకును సాధించింది. ఇంటింటి చెత్త సేకరణ, తడి, పొడిచెత్తను వేరుగా సేకరించి ఎరువు తయారు చేసే ప్రక్రియ, పొడి చెత్త నుంచి ప్లాస్టిక్, పేపరు, క్లాత్ వ్యర్థాలను రీసైక్లింగ్ కోసం వినియోగించేలా జరుగుతున్న కృషికి మున్సిపాలిటీ ఈ అవార్డుకు ఎంపికైంది.

సమష్టి కృషితోనే

పట్టణ ప్రజలంతా సానుకూలమైన వైఖరి కలిగిన వారు కావడం అదృష్టం. ప్రతి రోజూ వేకువజామున క్షేత్ర స్థాయి సిబ్బంది పనితీరును స్వ యంగా పర్యవేక్షిస్తున్నాం. ఆ సమ యంలో స్థానికుల నుంచి వస్తున్న స్పందన ఆనందం కలిగిస్తోంది. పట్టణాన్ని గార్బేజ్ ఫ్రీగా తీర్చిదిద్దా లన్న సంకల్పానికి ప్రజల సహకా రం పుష్కలంగా ఉంది. పాలకవర్గ సభ్యులు సహకరిస్తున్నారు. ఈ అవార్డు వెనుక మా అందరి సమష్టి కృషి ఉంది.

-సత్తారు శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, బొబ్బిలి



బొబ్బిలి మున్సిపల్ కార్యాలయం

జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలని, అందుకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో కృషి చేయాలని ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెయిన్ ఫారెస్ట్ అలయన్స్ లీడ్ ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ వారిచే సస్టయినబుల్ అగ్రికల్చర్ అండ్ బయోడైవర్సిటీ అక్రాస్ ల్యాండ్‌స్కేప్స్ ప్రాజెక్టుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవ వైవిధ్యం కాపాడే విధంగా సమీకృత వ్యవసాయ విధానాన్ని చేపట్టాలని, అందుకు స్థానిక ప్రజలకు ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. రెయిన్‌ఫారెస్ట్ అలయన్స్ సంస్థ కన్సల్టెంట్ కె.శ్రీధర్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్య క్రమంలో రెయిన్ ఫారెస్ట్ అలయన్స్ సంస్థ స్టేట్ టీం లీడర్ పి.వినూత్న, ఆర్వే ఎస్ఎస్‌డీఎం పి.షన్ముఖరాజు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి కేఎస్.వరప్రసాద్, మత్స్యశాఖ, వ్యవసాయ శాఖ ఇతర అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఆటోతో ప్రచారం చేస్తున్న దృశ్యం

పాలకొండ: సంక్రాంతి సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని పాలకొండ సీఐ చంద్రమౌళి సూచించారు. శుక్రవారం ఆటోతో ప్రత్యేకంగా ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం సీఐ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దొంగతనాలు జరగకుండా అరికట్టేందుకు ప్రత్యేకమైన నిఘాను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా మీ ప్రదేశాల్లో తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సంక్రాంతి సందర్భంగా కోడి, గొర్రె పందాలు, పేకాట ఆడడం నేరమన్నారు. పట్టణంలో ట్రాఫిక్ పోలీసులకు ప్రజలు సహకరించి ట్రాఫిక్ జాగ్రత్తలను అందరూ పాటించాలని సీఐ సూచించారు.

కొనసాగుతున్న న్యాయవాదుల సమ్మె



నిరసన దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

పాలకొండ: ప్రజా వ్యతిరేక కొత్త భూచట్టమైన ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్ట్-2022ను తక్షణమే రద్దు చేయాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు నిరసనదీక్ష శుక్రవారం కూడా చేపట్టారు. ఈసందర్భంగా పలువురు న్యాయాదులు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఈ నూతన భూ హక్కు చట్టం వల్ల రైతులు తమ భూములపై హక్కులను పూర్తిగా కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఈ చట్టం ప్రకారం భూ హక్కుదారులకు జిరాక్స్ కాపీలే మిగులుతాయన్నారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

పాచిపెంట: సారా ప్యాకెట్లను అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేశామని ఏఎస్ఐ మునలయ్య శుక్రవారం తెలిపారు. పెద్దవలస గ్రామానికి చెందిన కల్లికోట చందు, వెలగాడ జంపయ్యలను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఒడిశా నుంచి 400 సారా ప్యాకెట్లు దిగుమతి చేస్తుండగా పి.కోనవలస సమీపంలో పట్టుకున్నామన్నారు. ఇద్దరు నిందితులను సాలూరు కోర్టుకు రిమాండ్ నిమిత్తం తరలించామని తెలిపారు.

'ఆలయాల అభివృద్ధికి సహకరిస్తాం'



సింగిడిలో ఆలయ పనులపై ఆరా తీస్తున్న కమిషనర్

భామిని: ఆలయాల సమగ్రాభివృద్ధికి అన్ని రకాలుగా సహకరిస్తామని ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సతివాడ పంచాయతీ నూకాలమ్మగూడ గ్రామంలో అక్షర బ్రహ్మ ఆలయం, సింగిడిలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వర ఆలయాలను పరిశీలించారు. వేగవంతంగా నిర్మాణ పనులను చేయాలన్నారు. పలు గ్రామాల ఆలయాల అభివృద్ధికి టీటీడీ శ్రీవారి ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు సహకరిస్తామని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి గ్రామస్థులు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈఈ రమణ, అసిస్టెంట్ కమిషనర్ హరిసూర్య ప్రకాష్ ఉన్నారు.

వైసీపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారు

● జనసేన నాయకుడు గురాన అయ్యలు

విజయనగరం దాసన్నపేట: జిల్లాలో జరిగిన యువగళం, రా కదలిరా సభకు హాజరైన ప్రజానీకాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు మతిభ్రమించి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని జనసేన నాయకుడు గురాన అయ్యలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, ఓటమి తప్పదన్న భయంతో వైసీపీ నాయకులు కులాల మధ్య చిచ్చురేపుతున్నారని ఆరోపించారు. 2004లో కాంగ్రెస్ హయాంలో సాంబశివరాజు, శత్రుచర్ల, సుజయ్ పోటీ చేసినప్పుడు బీసీలు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. నేడు బీసీలకు అన్యాయం జరుగుతుందనడం హాస్యాస్పదమన్నారు. దమ్ముంటే మంత్రి బొత్స, చిన్న శ్రీనులు బేబీనాయనపై పోటీ చేయాలని సవాల్ విసిరారు.

22న రామతీర్థం వరకు శోభాయాత్ర

నెల్లిమర్ల: అయోధ్యలో ఈనెల 22న రామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని అదే రోజు జిల్లాలోని రామభద్రపురం నుంచి రామతీర్థం దేవస్థానానికి వందలాది మంది భక్తులతో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధులు కె.సత్యనారాయణ, ప్రసాద్ చెప్పారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని దేవస్థానంలో ఈవో బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్ కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ట్రస్టు బోర్డు సభ్యుడు తిరుమరెడ్డి శ్రీనివాసరావు, సత్యం, హిందూ ధర్మ రక్షా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వేణుగోపాల్, అర్చకులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

రామభద్రపురం: జిల్లాలో ప్రజల ఆరోగ్యం కోసం అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి భాస్కరరావు అన్నారు. బూసాయవలస హైస్కూల్‌లో శుక్రవారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయన మాట్లాడుతూ అన్ని వ్యాధులకు ప్రభుత్వపరంగా పరీక్షలు చేసి.. ఉచితంగా మందులు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారులు రవికృష్ణ, అపర్ణ, అర్చన, త్రినాథరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన

లక్కవరపుకోట: వ్యవసాయ పని, పంటల సాగుపై శ్రీకాకుళం చెందిన నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులకు విజయ నగరం ఏరువాక కేంద్ర అధికారులు అవగాహన కల్పించారు. శుక్రవారం ఎల్.కోటలోని వ్యవసాయ క్షేత్రంలో పంటల సాగు, వ్యవసాయ పనులు ఎలా చేయాలో వివరించారు. కళాశాల డీన్ శ్రీనివాస్, ఏరువాక కేంద్ర అధికారి లక్ష్మణ్ 24 మంది విద్యార్థులకు వరి, అపరాల సాగు, కలుపు మొక్కల తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యవసాయంపై ఆసక్తి చూపాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● పల్లెల్లో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లాలోని పలు చోట్ల బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. టీడీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.



పార్వతీపురం: మాట్లాడుతున్న బోనెల విజయచంద్ర



సీతంపేట: గుమ్మడలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న జయకృష్ణ



గుమ్మలక్ష్మీపురం: మాట్లాడుతున్న జగదీశ్వరి

వైసీపీ పాలనకు త్వరలోనే చరమ గీతం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: వైసీపీ పాలనకు త్వరలోనే చరమ గీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బొబ్బిలిలో నిర్వహించిన రా.. కదలిరా.. కార్యక్రమం పెద్దఎత్తున విజయవంతం అయిందని, దీనికి హాజరైన ప్రతిఒక్కరికీ పేరుపేరు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు చెప్పారు. ధాన్యం విక్రయించిన రైతులకు చెల్లింపులు సక్రమంగా జరగడం లేదని, గత నెల 24వ తేదీ నుంచి ధాన్యం విక్రయించిన రైతులకు చెల్లింపులు జరగడం లేదన్నారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకులు దేవకోటి వెంకటనాయుడు, జీవీ నాయుడు, బుజ్జి, బోనుదేవి చంద్రమౌళి, బి.సీతారాం, వేణు, కోలా మధు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గిరిజన అభివృద్ధి

సీతంపేట: టీడీపీతోనే గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. గుమడ గ్రామంలో శుక్రవారం ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ అంశాలను వివరించారు. ముఖ్యమంత్రిగా మళ్లీ చం ద్రబాబు నాయుడు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సవర తోట ముఖలింగం, క్లస్టర్ ఇన్‌చార్జి బిడ్డిక సుబ్బారావు, యూనిట్ ఇన్‌చార్జి బిడ్డిక స్వామినాయుడు, బీసీ సెల్ అధ్యక్షుడు ఆర్.రంగనాథం, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంట సుధ, మాజీ సర్పంచ్ బిడ్డిక ఆనందరావు, మూటక భరత్‌రాజ్, మండంగి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం



కురుపాం: మాట్లాడుతున్న కృష్ణబాబు

కురుపాం: వైసీపీ పాలనలో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని టీడీపీ అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు విమర్శించారు. శుక్రవారం కురుపాంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో ప్రజలందరూ రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేసే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో గిరిజనుల అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రంలో ఉన్న ఐటీడీఏలు పూర్తిగా నిర్వీర్యం అయిపోయాయన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక గిరిజన ప్రాంతాలను అభివృద్ధి బాటలో నడిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.వి.కొండయ్య, కోట బుజ్జి పాల్గొన్నారు.

విజయమే లక్ష్యం

పాలకొండ (వీరఘట్టం): రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేద్దామని పార్టీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ పిలుపునిచ్చారు. వీరఘట్టంలోని సీబీఎం కాలనీవాసులు, సీతంపేట మండలం అచ్చెబ గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు, జనసేన నాయకులు.. ఎం.రాజపురం గ్రామంలోని జయకృష్ణ స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జయకృష్ణ పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేద్దామని ప్రతినబూనారు. జయకృష్ణను కలిసిన వారిలో నిమ్మక దుర్గారావు, నిమ్మక నాగేశ్వరరావు, నిమ్మక శ్రీను, ఊయక విశ్వనాదం, పాలక బాస్కర్, చంద్రశేఖర్‌ఆజాద్, అనీల్, ధర్మారావు, తేజ చింత ఉమా, నత్తల అబి, ఏసేబు, సైల శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

చినవంకధారలో బాబు ష్యూరిటీ

గుమ్మలక్ష్మీపురం: చినవంకధార గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో వివరాలను కరపత్రాల రూపంలో పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృది చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాడి సుదర్శనరావు, పోలూరు శ్రీనివాసరావు, నరేష్‌దర్మ, దాసు, విప్లవకుమార్, కోటి అనీల్, నాగవేణి, రమేష్, సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

S.O.P.No. 3/2023

Between:

1. బొంగు గౌరి W/o లేటు గోవిందరావు, వయస్సు 48సం.లు, బంగారమ్మ కాలనీ, సాలూరు టౌన్ మరియు మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.
2. బొంగు సురేష్, S/o లేటు గోవిందరావు, వయస్సు 28సం.లు .. rest do..
3. బొంగు లోకేష్, S/o లేటు గోవిందరావు, వయస్సు 29సం.లు .. rest do..

.... పిటిషనర్లు

And

బొంగు శైలజ, D/o అప్పారావు, వయస్సు 35సం.లు, నాయుడువీధి, సాలూరు టౌన్ మరియు మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.

.... రెస్పాండెంటు

పై నెంబరు పిటిషనులో ఇందలి 1వ పిటిషనర్ గారికి భర్తగారు మరియు 2,3 పిటిషనర్లకు తండ్రిగారు అయిన బొంగు గోవిందరావు గారు తేది. 25.01.2021న కాలం చేసినందున, అతని సంబంధించిన డెత్ బెనిఫిట్స్ APSRTC తీసుకొనుటకు ఇందలి పిటిసనర్లు అతని యొక్క వారసులుగా డిక్లేర్ చేసి అతని యొక్క డెత్ బెనిఫిట్స్ తీసుకొనుటకు పైన పేర్కొన్న కోర్టులో S.O.P.No. 3/2023 దాఖలు చేసినారు. సదరు S.O.P.No. 3/2023 తేది. 25.01.2024కి వాయిదా అయివున్నది. కనుక విషయమై ఎవరికైనా అభ్యంతరములు ఉన్న ఎడల తేది. 25.01.2024న ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టులో స్వయంగా గానీ, ప్లీడర్ గారి ద్వారా గానీ హాజరై ఎట్టి ఆక్షేపణలు తెలియచేయగలరు. లేనిఎడల మీ పరోక్షాన తీర్మానం చేయుదురు.

(ఈ ప్రకటన శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ప్రచురించడమైనది.)

పి. మణికేశ్వరసాయి
న్యాయవాది, బొబ్బిలి
సెల్: 9494974403



గజపతినగరం: మరుపల్లిలో..



గంట్యాడ: మురపాకలో



పాలకొండ: ప్రాథమికోన్నత పాఠశాలలో..

ఘనంగా వివేకానంద జయంతి

వివేకానంద జయంతి వేడుకలను జిల్లాలోని పలుచోట్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి, అలాగే కూడళ్లలో ఉన్న ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

-ఆంధ్రజ్యోతి బృందం



కురుపాంలో..



గరుగుబిల్లి: నాగూరులో..



వంగర: వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



బొబ్బిలి: తారకరామా కాలనీలో..



కొత్తవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న వివేకానంద సేవాసమితి సభ్యులు



కురుపాం రూరల్: దురుబిలిలో గిరిజన యువతకు వాలీబాల్ కిట్లు అందిస్తున్న ఎస్ఐ షన్ముఖరావు

సాలూరులో నేడే భోగి

సాలూరు రూరల్: సాలూరులో ప్రతిఏటా ఒక రోజు ముందుగా భోగి పండగను నిర్వహించడం ఆనవాయితీ. ప్రజలంతా ఆదివారం భోగి పండగను నిర్వహిస్తుండగా, సాలూరులో శనివారం వేకువ జామున భోగి మంటను వేశారు.

సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 'బి'ప్లస్ గ్రేడ్

సాలూరు: పట్టణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు (నాక్) నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేటేషన్ కౌన్సిల్ (బెంగుళూరు) 'బి' ప్లస్ గ్రేడ్ ప్రకటించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 5, 6 తేదీల్లో నాక్ బృందం కళాశాలను పరిశీలించిందని ఆయన చెప్పారు. నాణ్యమైన విద్య, మెరుగైన వసతుల కల్పన, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని 2023-28 సంవత్సరం వరకు కళాశాలకు నాక్ 'బి'ప్లస్ గ్రేడ్ గుర్తింపు ఇచ్చినట్టు తెలిపారు.

కోడి పందేలు ఆడితే కేసులు

గుమ్మలక్ష్మీపురం: పండగ సందర్భంగా పేకాటలు, కోడిపందేలు ఆడితే చర్యలు తప్పవని ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. సంక్రాంతిని సుఖ సంతోషాలతో జరుపుకోవాలని, చట్టవ్యతిరేక పనులు చేస్తే చర్యలు తప్పవన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై దృష్టి పెడతామన్నారు. ఎల్విన్‌పేట సర్కిల్‌లో చెక్‌పోస్టులను కూడా ఏర్పాటు చేశామని, వచ్చేపోయే వాహనాలను తనిఖీ చేస్తున్నామని చెప్పారు.

నాగూరులో ఆరోగ్య సురక్ష

గరుగుబిల్లి: నాగూరు గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లాల జడ్పీ ఛైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు పరిశీలించి, వైద్య సేవలపై రోగులను ఆరా తీశారు. సర్పంచ్ కె.శిరీష, ఎంపీడీవో జి.పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్

(Regd.No.614, APMACS Act, 1995)

(H.O) D.NO. 49-34-22, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-530 016 ఫోన్ : 0891 - 2562731

Trust - Growth

నోటిఫికేషన్

కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, విశాఖపట్నం

పాలకవర్గం తేది.12.01.2024 న పంపిన అదేశముల మేరకు 3 (ముగ్గురు) బ్యాంక్ డైరెక్టర్లను ఎన్నుకొనుటకు నేను ఎన్నికల అధికారిగా నియమించబడినాను.

పై బ్యాంక్ మెంబర్లకు ఇందుమూలముగా తెలియజేయడమేమనగా ఈ క్రింది వివరించిన ప్రకారము బ్యాంక్ డైరెక్టర్ల ఎన్నిక కార్యక్రమము నిర్వహించబడును. (ఎన్నికల తేది.29.02.2024)

1. ఎన్నిక జరుగవలసిన డైరెక్టర్ల సంఖ్య	: 3(ముగ్గురు)
2. ఎన్నిక కాబడిన డైరెక్టర్ల కాల పరిమితి	: 5 సం.లు (01.03.2024 నుండి)
3. డైరెక్టరుగా ఎన్నిక కాబడుటకు కావలసిన అర్హతలు	: ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ యాక్టు 1995 మరియు బ్యాంక్ బైలాలో ప్రస్తావించబడిన విధంగా
4. నామినేషన్ పత్రము దాఖలు చేయవలసిన తేది, స్థలము, సమయం	: 16-02-2024 ఉదయం 10 గం॥ల నుండి సా॥ 3.00 గం॥ల వరకు సదరు బ్యాంక్ ప్రధాన కార్యాలయం (విశాఖపట్నం)లో ఎన్నికల అధికారికి గాని వారి అనుమతి పొందిన వారికి గాని దాఖలు చేయవలెను.
5. నామినేషన్ ఫీజు	: రూ.10,000/- (అక్షరాల పది వేల రూపాయలు)
6. నామినేషన్ పత్రములు పరిశీలన	: 17-02-2024 ఉదయం 10 గం॥ల నుండి బ్యాంక్ ప్రధాన కార్యాలయం (విశాఖపట్నం) నందు
7. ఆమోదించిన నామినేషన్ పత్రముల ప్రకటన	: 18.02.2024 బ్యాంక్ ప్రధాన కార్యాలయం నందు
8. నామినేషన్ పత్రముల ఉపసంహరణ	: 19.02.2024 ఉదయం 10 గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు బ్యాంక్ ప్రధాన కార్యాలయం (విశాఖపట్నం) నందు
9. నామినేషన్ పత్రముల నిఖర జాబిత ప్రకటన	: 20.02.2024 సాయంత్రం 5 గం॥ల తరువాత బ్యాంక్ ప్రధాన కార్యాలయం (విశాఖపట్నం) నందు, పోటీలేని పక్షములో అదేరోజు సాయంత్రం 6.00 గం॥లకు ఎన్నికల ఫలితాలు ప్రకటించబడును.
10. ఎన్నికల తేది	: 29.02.2024 ఉదయం 10 గం॥ల నుండి సాయంత్రం 5.00 గం॥ల వరకు బ్యాంక్ ప్రధాన కార్యాలయం (విశాఖపట్నం) నందు
11. ఎన్నికల విధానం, ఓట్ల లెక్కింపు	: రహస్య బ్యాలెట్ పద్ధతిన 29.02.2024 తేదీన ఎన్నిక ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభించి, ఎన్నికల ఫలితాలు అదే రోజు ప్రకటించబడును.

సం/- కె.శంకర్
న్యాయవాది మరియు ఎన్నికల అధికారి
కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్.
డోర్ నెం.49-34-22, (H.O) అక్కయ్యపాలెం, విశాఖపట్నం16.

విశాఖపట్నం
తేది.12.01.2024

షరతులు..

1. నామినేషన్ పత్రములు ఎన్నికల అధికారికి దరఖాస్తు పెట్టుకొని ఉచితముగా పొందవచ్చును.
2. నామినేషన్ దాఖలు చేయువారు మరియు వారిని ప్రపోజ్ చేయువార్ల పేరు, ఎన్నికల అధికారి పబ్లిష్ చేసిన మెంబర్ల లిస్టులో ఉండవలెను.
3. డైరెక్టర్ల ఎన్నికలు The A.P. Mutually Aided Co-Operative Societies Act, 1995 మరియు బ్యాంక్ బైలా మేరకు జరుపబడును.
4. ఓటు చేయుటకు అర్హత పొందిన మెంబర్ల జాబితా కావలసిన యెడల రూ.2,500/- (అక్షరాల రెండు వేల ఐదు వందల రూపాయలు) రుసుము చెల్లించి, నామినేషన్ల ఖరారు కాబడిన తుది జాబితాలోని అభ్యర్థులు మాత్రమే ఎన్నికల అధికారి నుండి పొందవచ్చును.